ద్వికళత్ర యోగం

ఓ అందమా, ఓ చందమా? పిల్ల ఏం బావుందని? రత్నంలాటి యీ ఒక్క మనవుడికి దూసి చూసి ఆ పిల్లను కట్టబెట్టడానికి ఎల్లా వప్పుకుంటాను, పిల్ల యెత్తునా ధనం తూచి కట్నం యిస్తారుట, ఎందుకివ్వరూ? ఇంతకీ ఆ పిల్లను చేసికోవలసినంత పరిస్థితి మనకేం పట్టింది? నా పెళ్ళి నాటికున్న నూటిరవై యొకరాలల్లా నూటయెనభై యొకరాలవరకూ పెరిగిందాయె. తరతరాలకీ ముప్పయ్యేసి యొకరాలు అసలాస్తిలో కలవనే కలుస్తోందికదా! నాలుగు పురుషాలనుంచీ వలుసులా ఒక్కొక్కజే మగపిల్లాడు. అసలీ వయస్సులో పెళ్ళిచేయ తలచామని తెలుస్తే చాలు కోటికి పడగలెత్తిన శ్రీమంతులు బొమ్మల్లాంటి కన్యల్ని కాళ్ళముంగుంచి, అడిగిన కట్నం ఇయ్యకపోతారా? ఏమయినా ఆస్తులిల్లా పోగుపడుతూండడం, ఏకపుత్ర సంతతీ యీ వంశాని కాచారమయిపోయింది. ఇంక గాడితప్పి నడిచేలా లేదీ సంసార శకటం' అని సణుక్కుంటూ 'ఇంక మొగమాటం యెందుకు, వాణ్ణే పిలిచి అడిగేస్తా నాలుగు మాటలూను. నా బొందెలో పూపిరుండగా జరగనిస్తానా యీ సంబంధం?' అని నిశ్చయించుకొని 'ఒరేయి అబ్బాయీ!' అని కేక వేసింది తులసమ్మదగ్గర యెండపడిని కూర్చున్న ముసలి చితంతువు.

కళ్ళజోడు పెట్టెలో పెట్టి టక్కున నొక్కుతూ తల్లివద్దకు వచ్చి నిలబడ్డాడు లక్ష్మీపతి. 'ఆ నాడు ఆర్యాపురంలోని ఆంజనేయులుగారూ, కొడుకూ పెళ్ళి చూసుకొని తప్పరించిన సంభంధమేనా యిది?' అంది తల్లి. 'ఒక్క ఆర్యాపురం యేమిటి, ఆర్యావర్తం అంతా తిరుగుతున్నారు సంబంధంకోసం, చివరికి ఏమూలనో ఉన్న వలసాంధ్రుల్ని కూడా కంగుకదిపి చూచారు పెద్ద నోట్లకట్టలు కుమ్మరిస్తూ. ఏమయితేనేం ఒక్కడూ గుమ్మంయెక్కి తొంగిఅయినా చూడ్డంలేదు. రొమ్ముమీద కుంపటిలా ఉన్న యీ పిల్లకు సగం ఆస్తినైనా కట్టబెట్టి విడిపించుకుందామని చూస్తున్నాడా కన్యాదాత' అన్నాడు లక్ష్మీపతి.

'అయితే నిన్ను శరణుజొచ్చాడా యేమిటా పెద్దమనిషి.'

'శరణు కాదు, కరుణ' అన్నాడు కొడుకు.

'ఎవర్ని చూసి, పిల్లని చూశా, పిల్ల తండ్రిని చూశా యీ కరుణ' అంది తల్లి.

'ఇద్దర్నీ చూసి కాదు, మన చిట్టిబాబుని చూసి' అన్నాడు లక్ష్మీపతి.

'ఏమిటిరా నీ వనేది? చిట్టిబాబుని చూశా?' అని ముఖం పైకెత్తి కొడుక్కేసి చూచింది.

లక్ష్మీపతి ముఖం వెలవెలబోయింది. 'చిట్టిబాబు కేమిరా? పున్నమి చంద్రుడివంటి బిడ్డనిగూర్చి అల్లా దిసులుగా మాట్లాడుతున్నావేంరా? ఏమయినా, బొందిలో పూపిరుండగా యీ సంబంధం జరగనీయను, జరగనీయను తెలిసిందా' అంది ధీమాగా తల్లి.

'రోజూ తులసమ్మ దగ్గర కూర్చుని నీవు చేసే జపం యిదేనా ఏమిటమ్మా" అన్నాడు కొడుకు.

తల్లి : నీవు ఇనప పెట్టెవద్ద కూచుని చేసే జపంకంటె ఘనమయిన జపమే చేస్తున్నానురా నాయనా! తరానికి తరానికీ మధ్య ఆస్తి కుప్పలా పేరుకుపోడం, నాలుగు పురుషాలనుంచీ వలుసులా ఒక్కొక్క పిల్లజే పుడుతూండడం అనే ఈ వంశాచారాల్ని తప్పించమని ప్రార్థిస్తున్నాను.

"అయితే ఒక్క సంగతడుగుతున్నాను. నిదానించి సమాధానం చెప్పమ్మా" అని తల్లికి దగ్గరగా చతికిలబడ్డాడు లక్ష్మీపతి.

కళ్ళు పెద్దవిచేస్తూ "అల్లా అడుగు కావలసిందేదో" అంది ఆమె.

"నాలుగు తరాల్నుంచి ఒక్కజే మగపిల్లాడు పుడుతున్నాడా మన వంశంలో" అన్నాడు కొడుకు.

"కాదుట్రా మరి" అంది ధీమాగా తల్లి.

"మన వంశంలో ఇదొక్కటే ఆచారమా ఇంకేమున్నా విడ్డూరాలుజరుగుతున్నాయా" అన్నాడు లక్ష్మీపతి.

"అడిగతలచిందేదో సూటిగా అడుగు" అంది తల్లి.

కొడుకు : నాలుగు తరాలనుంచి ఏకపుత్ర సంతతేనా నీవు కళ్ళారా చూచేది?

తల్లి : మూడడం ఏమిట్రా అనుభవిస్తున్నాం కాదూ?

కొడుకు : ఆఁ! అదే! అనుభవిస్తున్నాం. సరే కాని నీ వెరుగున్నంతలో యెంతమందికి రెండో వివాహం జరిగిందంటావు మన వంశంలో?

తల్లి : ఎంతమందికేం, మామగారికి, మీ తండ్రికి, నీకూ అందరికీ జరిగాయి.

కొడుకు : అల్లాగా? ఆస్తుల్నీ, పుత్రుల్నీ గూర్చి ఆలోచిస్తున్నావు గాని ఇంతమందికీ ఈ వంశంలో యీ ద్వికళత్ర యోగాన్ని గూర్చి ఎప్పుడైనా ఆలోచించావా?

తల్లి : ఆలోచించేందు కేముంది? కర్మ, ఎవరు తప్పిస్తారు?

కొడుకు : అయితే యీ యోగం మన చిట్టిబాబుకి కూడా పడుతుందేమో?

తల్లి : శుభమా అని పెళ్ళిమాటలు మాటలాడుతోంటే తీరికగా కూచుని ఇల్లాటి మాటలు పలుకుతున్నావేమిరా?

కొడుకు : పెళ్ళి ప్రస్తావన వచ్చింది కాబట్టే వంశాచారాన్ని గూర్చి కూడా ఆలోచించవలసి వస్తోంది. తరతరాల్నుంచి వచ్చే ఆస్తులమీదా, పుత్ర సంతతిమీదా ఉన్న మమకారం ఈ ద్వికళత్ర యోగంమీద ఎందుకు నీకు లేదూ అని అడుగుతున్నా.

కొడుకు చెప్పిన మాటలు వినేసరికి ఆమెకి కొంచెం ధైర్యం సడలిపోయింది. సవతి పోయిన పదమూడోనాడు జరిగిన తన వివాహం మసకగా కళ్ళకు గోచరించింది. చేతులారా పెద్దకోడల్ని బూడిదచేసిన ఘట్టం జ్ఞాపకం వచ్చే సరికి కళ్లు చెమ్మగిల్లాయి. గడ్డం కింద చెయ్యిపెట్టుకుని కొంగుతో కళ్ళద్దుకోడం ప్రారంభించేసరికి మరింత దగ్గరగా జరిగి లక్ష్మీపతి సన్నని గొంతుకతో "అప్పుడే చాలా కాలమునుంచి యీ సమస్య నన్ను చాలా బాధిస్తోంది అమ్మా. చిట్టిబాబుకి కూడా యీ ద్వికళత్రయోగం ఉండి తీరుతుందని మనస్సు నొక్కిచెపుతోంది. అల్లాఅని ఊరుకున్నానా? కోరుకొండ ఆచార్లుగారికి అబ్బాయి జాతకం చూపెట్టాను. చెప్పలేకనే కాబోలు జాతకంలో ఏవో కొన్ని జంట జంట యోగాలున్నాయని నాన్చేశాడాయన. ఇంక నీదగ్గర దాచడం ఎందుకమ్మా. ఈ కురూపి కన్యను కట్టబెట్టి అబ్బాయికి ఆ అడ్డుకాస్తా తొలగిద్దామని నిశ్చయించాను. అయాచితంగా అపార ధనం కూడా సమకూరుతోంది కదా! ఇంతకీ అబ్బాయికి యుక్తాయుక్త వివక్షణ ఇంకా కలగలేదు. మన అదుపాజ్ఞలలోంచి దాటిన తరువాత ఇల్లాటినిశ్చయాలు కొనసాగాలేవు, పశ్చాత్తాపాలూ తప్పవు. కొంచెం బెట్టునరి

కర్రా చంద్రశేఖరశాస్త్రి

★ ద్వికళత్రయోగం ★

దూపుతూ అబ్బాయికి ప్రథమంలో యీ సంబంధం చేయడం ఖాయం. తరువాతనా దేవలోకం నుంచి రంభా ఊర్వశుల్ని దిగుమతీ చేయిస్తా. చేతనైనంతవరకూ యోగాలు సరళమార్గంలో దాటిపోయే ప్రయత్నాలు చేసుకోవాలి' అని వెళ్ళిపోయాడు లక్ష్మీపతి.

ముసలితల్లి తులసమ్మకి ఎడమొగంగా తిరిగి 'అవును మరచేపోయాను. నాతెలివి మండా. అన్నిటికంటె పెద్దఘట్టాలే మరచిపోయాను. అవును అందరికీ ద్వికళత్రయోగమే.' చటుక్కున తులసమ్మకేసి తిరిగి చేతులుజోడిస్తూ 'చిట్టిబాబుకి కూడా ద్వికళత్రయోగం రాసిపెట్టావా తల్లీ!' అని కళ్లుమూసుకుంది.

* * *

మొదటి కాను పవడంచేత మూడువారాల నుంచీ నలతలో పడింది కామేశ్వరి ఆరోగ్యం. అత్తింటివైపు నాటువైద్యులు, పుట్టింటివారు పెట్టిన పెద్దడాక్టర్లు ఆశా నిరాశల్లో ఊగిపోతున్నారు. అసలు తన కోడలి పరిస్థితి ఇంతవరకూ వస్తుందనుకోలేదు లక్ష్మీపతి. అదీగాక కాపురాలు చేయకుండానే తనవంశంలో వారందరికీ ద్వికళత్రయోగం ప్రసాదించారా కోడళ్లు. చిట్టిబాబుకికూడా అల్లాటిస్థితి ఆప్రాయంలోనే సంభవిస్తుందని ఎదురుచూచాడు చాలకాలం. ఆ శుభముహూర్తం వస్తుందని యెంచుకొనే కదూ ఈ సంబంధానికి తారసిల్లాడు? అయితేనేం యెంతకాలం ఓపికపట్టగలడు? పిల్ల పెద్దమనిషి అయిన అయిదేళ్లవరకూ నిరీక్షించాడు. నెలలుగడచినకొలది గుండెలో ఆరాటం ఎక్కువయింది. ఉన్నయోగం ఏదో ఎక్కడుంటే మాత్రం తప్పుతుందా అని ధైర్యంచేసి పిల్లని కాపురానికి తీసికొనివచ్చాడు. ఒకేయింటిలో అల్లాటి కొడుకుని ఆ కోడల్ని చూసేసరికి రాగద్వేషాలు ప్రబలడం ప్రారంభించాయి. దానికితోడు పులిమీద పుట్రలా యీ కానుపొకటికూడా దాపురించింది. సంతతిలేని ద్వికళత్రయోగాన్ని ఆనందంతోటే అంది పుచ్చుకున్నారు తామంతా. చిట్టిబాబువిషయంలో ఇల్లా యోగం అడ్డుతిరుగుతుందేమా అని అయోమయంలో పడి అడిగిందే తడవుగా పుట్టింటికి పంపించేశాడు కోడల్ని.

కామేశ్వరి జీవితం ఒక చిరుకురుక్షేత్రం అయిపోయింది. ఇరువైపుల బంధుకోటికి. తన సంబంధం చేసుకోవడంలో ఉండే అంతర్యాన్ని పసికట్టి కామేశ్వరితండ్రి నరసయ్య డాక్టర్ల అడుగులకు కాసులెత్త నారంభించాడు. అంచీలమీద ఎదురూ వాలూ రెండు కార్లు మందు సీసాలు, ఇంజక్షను బుడ్లు అందీయడానికి సిద్ధంగాఉంచాడు నరసయ్య. సవ్యసాచుల్లాగ, ఆఆడ డాక్టరు మగడాక్టరు తమ చికిత్సా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. డాక్టర్ల నిద్దరిని తన యింటిలోనే దిగ్బంధం చేసేశాడు నరసయ్య లాంఛనంగా మాత్రం వియ్యంకుడు పంపిన ఆయుర్వేద వైద్యులు నాడి పరీక్షించి ఏవో మాత్రలు కాగితాలలో చుట్టబెట్టి ఇయ్యసాగారు రెండురోజుల దాకా. పుంఖాను పుంఖాలుగా ప్రయోగించే డాక్టర్ల చికిత్సల మధ్య నిలవడాని కింక తమకు తావు లేక అరుగుమీదే చతికిలబడ జొచ్చారా ఆయుర్వేద వైద్యులు. లక్ష్మీపతి ఫర్లాంగు ఫర్లాంగు దూరాలలో మజిలీలు ఏర్పాటుచేసి వాటిలో ఎప్పటి కప్పుడు వార్తలు తీసుకొచ్చి చెప్పే సొంతపరివారాన్ని ఏర్పాటు చేసికొని ఉంచుకున్నాడు. అక్కడ జరిగే కార్యక్రమం అంతా మరుక్షణంలో లక్ష్మీపతి శ్రవణకుహరంలోకి ప్రసారమయిపోతోంది. మూడురోజులు గడిచాయి. ప్రయోగించిన దివ్యాస్త్రాలన్నీ ఏ దారిని పోతున్నాయో కాని ఒక్కటీ లక్ష్యం చేరుకొని పని చేయలేకపోతున్నాయి కామేశ్వరి శరీరంమీద. అయినా రాత్రింబగళ్లు వ్యాధితో ప్రబలంగా పోరాడడం మానలేదా డాక్టర్లు.

భిన్నభిన్న మనస్తత్వాలుగల బంధుకోటి యావత్తూ ఇరుపక్షాలా కామేశ్వరిజీవితాన్ని కామ్యంగా పెట్టుకొని అంతర్వేదిలగాయతు కన్యాకుమారి వరకూగల ముక్కోటి దేవతలకూ మ్రొక్కుబడులకు వాగ్దానాలు చెల్లింపసాగారు. కామేశ్వరి జీవించాలనీ, జీవిస్తుందనీ పుట్టింటి వారి మహదాశయం. టిట్టిబాబు జీవితరంగంమీదనుంచి ఈ పాటికి కామేశ్వరీపాత్ర నిష్క్రమించాలని, నిష్క్రమిస్తుందనీ చిట్టిబాబు ఆత్మీయులు ప్రచ్ఛన్నంగా తలపోయసాగారు. కన్నవారికి మేరువు, కొన్నవారికి అణువూ అయిపోయింది కామేశ్వరి కళేబరం. చినుకు చినుకులా ఆరంభమయిన ఈ హృదయాశయాలు క్రమేపీ తుపానులా విజృంభింపసాగాయి మనస్సుల్లో ఉభయవర్గాల వారికీ. ప్రభాతంనుండి విభాతం వరకూ చేయించిన చికిత్సల బలాబలాలు నిర్ణయించుకుంటూ కాలం గడుపుతున్నారు కామేశ్వరి బంధువులు. ఆరోజు కారోజు డాక్టర్ల నిద్దరినీ అగ్నిపరీక్ష చేయసాగింది కామేశ్వరిస్థితి. అయిదు రోజులనుంచీ ఆయింటిలో ఏ ప్రాణీ గుక్కెడు గంగైనా మింగకుండా కలయతొక్కేసుకొంటున్నారు మనస్సుల్ని. ప్రత్యేకం పట్నంలోని పెద్ద మందుల షాపు నొకదాన్ని జబ్బు కుదిరేవరకూ గుత్తకు పుచ్చేసుకున్నాడు నరసయ్యగారు.

వేసినమందులు, గుచ్చివ సూదిపోట్ల ప్రభావంవల్ల తెల్లవారితే మీ పిల్ల ప్రాణానికి మాదీ పూచీ అన్నారు నరసయ్యతో డాక్టరు మహాశయులిద్దరూ. దాన్ని తలక్రిందుచేసి ఈ రాత్రితో కామేశ్వరి జీవితం ఆఖరని డాక్టర్లు చెప్పినట్లు వార్త లందిచ్చాడు లక్ష్మీపతికి దౌవారికుడొకడు. కళ్లల్లో వత్తులు వేసికొని అణువు అణువునా పరిణామాన్ని కనిపెడుతూ ప్రతిక్షణ మహాయుగాల్ని గడుపుతోంది కామేశ్వరి ఆత్మబలగం యావత్తు.

రాత్రి నాలుగు గంటలయింది. డాక్టర్లిద్దరూ పడకకుర్చీలమీదనే కునికిపాట్లు పడుతున్నారు. బంధువర్గమంతా ఆవలింతలతోటి, ఒళ్లు విరుపులతోటి మగతల్లో మునిగిఉన్నారు. తేవలసిన మందు సామగ్రి యావత్తూ దిగుమతీ చేసి రెండు కారులూ ఆజ్ఞలకె నిరీక్షిస్తున్నాయా అన్నట్లు దీపకాంతులతో పహరాకాస్తున్నాయి కీథి ద్వారాని కిరుప్రక్కలా. చేయవలసిన చికిత్సలన్నీ పూర్తిచేసి కేవలం దైవాన్నే నమ్ముకొని ఉన్నందువల్ల వాతావరణం. అంతా నిశ్శబ్దంగా ఉంది.

ఉండి ఉండి హఠాత్తుగా ఒక్కసారి కెవ్వున కేక వేసింది కామేశ్వరి. అందరూ ఉలికిపడిలేచి రోగివద్దకి పరుగులెత్తారు. దీపాలన్నీ పెద్దవిచేసి జనం మంచంచుట్టూ మూగిపోయారు. పెట్టిన గడువైనా దాటకుండా కొంప గుండం చేస్తుందా యీ ఒక్క కూతురూను అని గుండె బాదుకొంది రోగితల్లి. డాక్టర్లిద్దరూ తలవైపు కాళ్ళవైపు నిలబడి సాధనాలతో పరీక్షిస్తున్నారు. ఆడ డాక్టరు నిదానంగా రోగిని పరకాయించి యేదో మగడాక్టరుతో చెప్పి "అందరూ ఒక్కసారి అవతలకి వెళ్ళాలి. ఊఁ! త్వరగా, నడవండి" అని అరుస్తూ గది తలుపులు రెండూ గభాలున వేసేసింది. గది లోంచి ఓసారి మెల్లగాను, మరోసారి గట్టిగానూ మూలుగుతోంది రోగి. అందరూ చెవులు రిక్కించి సూత్రప్రాయంగా వినబడే ప్రతీమూలుగుకి గుసగుసలతో భాష్యాలుపక్రమింప సాగారు.

సరిగా గడియారం ఇంక పదినిమిషాలకి ఆరు కొడుతుందనగా గభీలున తలుపులు రెండూ తెరుస్తూ ఆడడాక్టరు "పంతులు గారూ! కవల మగబిడ్డలండీ!!" అని అరిచింది కామేశ్వరి తండ్రిని సమీపిస్తూ. ★

ప్రతిష్ఠమైన సంజన్‌గూడు పండ్రసాది వారి
అగత్యమైన కుటుంబ ఔషధములు
కాస్‌మస్ కస్తూరి మాత్రలు...సీసా 0-6-0
కర్‌జన్ గోరోజన మాత్రలు... 0-8-0
బాలక్స్ చిరేవనమగుటకు మాత్రలు... 0-6-0
మా మందుల పూర్ణ జాబితాకు వ్రాయుడు